RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 86 | ఫిబ్రవరి 20, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379




# 'అసైన్డ్' for అగ్రి

- వ్యవసాయానికి మాత్రమే అసైన్డ్ భూములు
- అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు లేదు
- నిబంధనలను ఉల్లంఘిస్తే ఏ అధికారికైనా శిక్ష తప్పదు: హైకోర్టు

**వేద న్యూస్, హైదరాబాద్:**

**అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. కొంత మంది మోసగాళ్లు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖాధికారులతో కుమ్మక్కై అమాయకులను మోసం చేస్తున్నారని హైకోర్టు వ్యాఖ్యానించింది. అసైన్డ్ భూములను భూమార్పిడి చేసి విక్రయిస్తుంటారని తెలిపింది. అసైన్డ్ భూములని తెలియక నిజాయితీగా కొనుగోలు చేసినవారు మోసపోతున్నారని హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. చట్టప్రకారం అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్లకు లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. అసైన్డ్ భూముల ఆక్రమ బదిలీకి బాధ్యులైన అధికారులు చట్టప్రకారం శిక్షార్హులని తెలిపింది.**

అమాయకమైన కొనుగోలుదారులు అసైన్డ్ భూములన్న వాస్తవం తెలియకుండా కష్టార్జితాన్ని వెచ్చించి భూములను కొనుగోలు చేస్తున్నారని దీనిని ఆసరా చేసుకొని కొంత మంది మోసగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారని హైకోర్టు పేర్కొంది. 1977 అసైన్డ్ చట్టం నిబంధనల ప్రకారం ఏదైనా కారణంగా అసైన్డ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే నిజాయితీగా కొనుగోలు చేసిన వాళ్లకు నష్టం వాటిల్లుతోందని అభిప్రాయం వ్యక్తం చేసింది. మోసగాళ్లు అధికారులతో కుమ్మక్కై తమ స్వాధీనంలో లేని, ఎలాంటి విక్రయ దస్తావేజులు లేని భూములనూ విక్రయిస్తుంటారంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలో అసైన్డ్ భూమి/లావణి పట్టా భూమి విక్రయంపై మూడు నెలల్లో విచారణ జరిపి అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సర్వే నం.176/23లో 33 గుంటల లావణి పట్టా భూమిని తమ అంగీకారం లేకుండా మరొకరికి విక్రయించడంపై నాగమ్మ ఆమె ముగ్గురు కుమారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్ రెడ్డి విచారణ చేపట్టారు. తన భర్త మరణాంతరం ఆయన పేరుమీద ఉన్న అసైన్డ్ భూమిని నలుగురు కుమారులు మరో వ్యక్తికి 2021లో విక్రయించారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విక్రయించేముందు తల్లితోపాటు ఇతర వారసుల అంగీకారం తీసుకోలేదన్నారు.



ఆసైన్డ్ భూమి/లావణి పట్టా అన్న విషయాన్ని తొక్కిపెట్టి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పిడి చేసి విక్రయించారన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి తెలంగాణ ల్యాండ్ రెవెన్యూ చట్టం 1317 ఫసలీ ప్రకారం ఆసైన్డ్ భూమిని వ్యవసాయానికి మాత్రమే వినియోగించాల్సి ఉందన్నారు. ఏమైనా షరతులను ఉల్లంఘించినట్లయితే అసైన్డ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చన్నారు. తెలంగాణ అసైన్డ్ భూముల చట్టం సెక్షన్ 5(1) ప్రకారం కలెక్టర్ లేదంటే ఎమ్మార్వో స్థాయికి తగ్గని అధికారులు అసైన్డ్ భూముల జాబితాను రిజిస్ట్రేషన్ అధికారులకు అందజేయాల్సి ఉందన్నారు. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్‌కు లేదన్నారు. అసైన్డ్ చట్టం ప్రకారం ఏ అధికారి అయినా నిబంధనలను ఉల్లంఘిస్తే ఆరు నెలల సాధారణ జైలు, రూ.10 వేల వరకు జరిమానా విధించవచ్చన్నారు.

## అప్పులు చెల్లించేందుకు దొంగతనాలు!

- చోరీలకు పాల్పడుతున్న దంపతుల అరెస్టు



వేద న్యూస్, హన్మకొండ :

4లో..

# పన్ను వసూళ్లలో పురోగతి అవసరం

- బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే
- 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక కథనానికి స్పందన
- రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్ష







**వేద న్యూస్, వరంగల్:**

ఈ నెల 18న 'వేద న్యూస్' తెలుగు దినపత్రిక ప్రధాన సంచికలో 'పెద్దలకు ఒక'లా'.. పేదలకు ఇంకో'లా'!' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందన వచ్చింది. పన్నుల వసూళ్లలో మున్సిపల్ కార్పొరేషన్ పోకడపై వార్త కథనంలో ప్రస్తావించగా, అది బల్దియా వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ కథనంపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ స్పందించి రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు.

**సమర్థవంతంగా ట్యాక్స్ వసూళ్లు చేయండి: కమిషనర్**

పన్ను వసూళ్లలో పురోగతి అవసరం అని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం లో రెవెన్యూ అధికారులతో పన్ను వసూళ్ల పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా పన్ను వసూళ్లు జరపడానికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపునకు గడువు సమీపిస్తున్నందున ఆర్ఐ లతో పాటు బిల్ కలెక్టర్ లకు వసూళ్ల లక్ష్యాలను కేటాయించి వసూళ్లు చేయాలని అన్నారు.

ఆర్ ఐల వారిగా ఇప్పటివరకు జరిగిన వసూళ్లను కమిషనర్ సమీక్షించారు. ప్రతి బిల్ కలెక్టర్ ప్రతి రోజు 100 రెసిడెన్షియల్ లతోపాటు 20 కమర్షియల్ వసూళ్లు జరపాలని రెవెన్యూ సిబ్బంది వద్ద వసూళ్ల సంబంధిత అసెస్మెంట్ జాబితా 100 మంది పెద్ద మొత్తం లో టాక్స్ చెల్లించాల్సిన వారి జాబితా 200 మంది డిఫాల్టర్ ల జాబితాలు అందుబాటు లో ఉంచుకొని వసూలు జరపాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ లు రవీందర్, ప్రసన్న రాణి, పన్నుల అధికారి రామకృ,ష్ణ ఆర్ ఓ లు యుసుఫోద్దీన్, శ్రీనివాస్, షహాజాది బేగం, ఐటి మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రోడ్ల పరిశీలన

**వేద న్యూస్, హనుమకొండ :**

స్మార్ట్ సిటీ పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదశించారు. హనుమకొండ జిల్లా జిడబ్ల్యూసి పరిధిలో స్మార్ట్ సిటీ పథకం క్రింద కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా టీచర్స్ కాలనీ ఫేజ్ -1 లో సిసి రోడ్ ను, వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న అభివృద్ధి పనులు, 52 వ డివిజన్ రాజాజీ నగర్ కల్వర్టు పనులు, నయీం నగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు, పద్మాక్షి టెంపుల్ రోడ్డు యందు సిసి రోడ్డు డ్రైన్ పనులను కమిషనర్ కొలతల ద్వారా పరిశీలించారు. ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, డిఈలు రవి కిరణ్, అజ్మీరా శ్రీకాంత్, స్మార్ట్ సిటీ పిఎంసి భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.





# ప్రజల కష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసు

- బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ సీఎం కేసీఆర్
- వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం
- పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయం
- స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కష్టపడాలి
- పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజల కోసం పోరాటం చేయాలని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. 7 నెలల విరామం తరువాత బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ పాల్గొన్నారు. పార్టీ స్థాపించి 24 సంవత్సరాలు పూరై 25వ ఏట అడుగుపెడుతుంది. ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడూతూ బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదని వెల్లడించారు. ప్రజల కష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసని, వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటివరకు సుదీర్ఘ ప్రస్థానంపై నేతలకు, కార్యకర్తలకు కేసీఆర్ వివరించారు. ఉద్యమం, తెలంగాణ అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తు చేశారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందగానే పార్టీ పని అయిపోందని బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా పని చేశారని పార్టీ నేతలపై కేసీఆర్ సీరియస్ అయ్యారు. అందుకే కొందరు ఎమ్మెల్యేలు నైరాశ్యంతో పార్టీ మారారని ఇలా ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయమన్నారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఏప్రిల్ 10 నుంచి 27 వరకు సభ్యత్వ నమోదు ప్రారంభించాలని, సభ్యత్వ నమోదు తర్వాత సంస్థాగత కమిటీల ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అక్టోబర్, నవంబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నిక ఉంటుందని, పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం

మిగతా 4వ పేజీలో..



### ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే
# కఠిన చర్యలు తప్పవు
### వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబాల, నేరెళ్ల గ్రామాలలో ఉన్న వాగులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఆకస్మికంగా సందర్శించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులు ఏయే మార్గాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారో ఆ మార్గాల దగ్గర ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని సేకరించి వారి కార్యకలాపాల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కమలాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణకు సూచించారు. అనంతరం అక్రమ ఇసుక రవాణా కు అడ్డుకట్ట వేయడానికి అంబాల శివారు ప్రాంతంలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ లో వాహనాలను ఏ విధంగా తనిఖీ చేస్తున్నారో తదితర వివరాలన్నిటిని చెక్ పోస్ట్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాహనాలను తనిఖీ చేసే సమయంలో చెక్ పోస్ట్ సిబ్బంది తప్పనిసరిగా వాహనం యొక్క పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇసుక లోడ్ తో వచ్చే వాహనాలను ఆపి ఇసుక తరలించడానికి వారికి అనుమతి పత్రాలు ఏమి ఉన్నాయో క్షుణ్ణంగా పరిశీలించి, సరియైన అనుమతి పత్రాలు ఉన్న వాహనాలను పంపించేయాలని, అనుమతి పత్రాలు లేని వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టకుండా కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలించాలని చెక్ పోస్ట్ సిబ్బందికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఈ సందర్భంగా సూచించారు.

# రంజాన్ భక్తుల డ్యూటీ మినహాయింపు హర్షణీయం

- హిందూ భక్తులకు కూడా ఇదే విధంగా వర్తింపచేయాలి
- పోగుల సైదులు గౌడ్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల ముఖ్యమైన పండుగ రంజాన్ సందర్భంగా డ్యూటీలకు సమయం మినహాయింపు కల్పించరాని హర్షం వ్యక్తం చేస్తూ అదే విధంగా హిందువులకు కూడా అయ్యప్ప స్వాములు,భవాని, ఆంజనేయ, శివ భక్తుల మాలధారణ రోజుల్లో డ్యూటీ సమయాన్ని మినహాయింపు కల్పించాలని టిటిడిపి నాయకులు పోగుల సైదులు గౌడ్ ప్రభుత్వానికి సూచించారు. సర్వమత సామరస్యాన్ని కోరుకునే తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాల ప్రజలకు ఒకే విధమైన సడలింపులు కల్పిస్తే ప్రజలందరూ కులమత తారతమ్యాలు లేకుండా సంతోషంగా ఉంటారన్నారు. కొందరికి మాత్రమే కల్పించడం వల్ల మత తేడాలు ఏర్పడుతున్నాయన్నారు. అలా కాకుండా మిగతా మతాల వారిని కూడా సమానంగా చూసే విధంగా డ్యూటీ సమయం సడలింపు చేసి మత విభేదాలకు తావు లేకుండా చూడాలని హితవు పలికారు.

# విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలు పంపిణీ

**వేద న్యూస్, కరీమాబాద్ :**



ఉర్సు కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మీ నేస్తం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంగ్లీష్ డిక్షనరీలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయప్రకాష్ అధ్యక్షత వహించగా మీ నేస్తం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుల పెల్లి యాకోబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు భవిష్యత్తులో మంచి క్రమశిక్షణ గల పౌరులుగా సమాజానికి సేవలు అందించాలని అన్నారు. సమాజంలో మంచి వ్యక్తిగా ఉన్నత భావాలతో జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బిక్షపతి, ప్రసాద్, భాగ్యలక్ష్మి, ఉమాకుమారి, సంధ్యారాణి, సుఖన్య, రేఖ తదితరులు పాల్గొన్నారు.

# తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ

కాకినాడ : కాకినాడ జిల్లా తుని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికలో గందరగోళం నెలకొంది. టీడీపీ, వైసీపీ నేతలు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. మరోవైపు కోరం సరిపోకపోవడంతో తుని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మంగళవారం నాడు ఎన్నికల నిర్వహిస్తామని సంబంధిత అధికారి తెలిపారు.మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేశారు. టీడీపీ మద్దతుగా ఉన్న కౌన్సిలర్లు 10 మంది హాజరు కాగా, వైసీపీ కౌన్సిలర్లు రాకపోవడంతో కోరం లేదని ఎన్నిక రేపటికి వాయిదా వేశారు. కోరం లేని కారణంగా వైస్ ఛైర్మన్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సైతం వాయిదా పడింది. వైసీపీ కౌన్సిలర్లు ఓటింగ్ లో పాల్గొనకపోవడంతో కోరం లేని కారణంగా మంగళవారానికి ఎన్నిక వాయిదా వేశారు. ఇటీవల కొన్ని హిందూపురం సహా కొన్ని చోట్ల మున్సిపల్ చైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నికలు, నగర పాలక పంచాయతీ ఎన్నికలు జరగగా.. కొన్నిచోట్ల ఎన్నిక వాయిదా పడింది. ఈ క్రమంలో తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. నేడు ఎన్నిక ఉండటంతో మున్సిపల్ కార్యాలయం వద్దకు సోమవారం ఉదయం 10 మంది టీడీపీ మద్దతు కౌన్సిలర్లు వచ్చారు. వైసీపీ కౌన్సిలర్లు ఓటింగ్ లో పాల్గొనేందుకు ఆఫీసుకు రాలేదు. తుని మున్సిపల్ ఆఫీసు సమీపంలో ఒక్కసారిగా టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు యత్నిస్తుండగా.. మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజా, వైసీపీ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కూటమి వర్గీయులదే తప్పు అని, తమపై పెత్తనం చెలాయించడం కరెక్ట్ కాదని పోలీసులకు సూచించారు. టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య గొడవ పెరిగే అవకాశం ఉందని, మరోవైపు వైస్ చైర్మన్ ఎన్నిక ఉండటంతో తుని మున్సిపల్ ఆఫీసు వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

# కిడ్నీ రాకెట్ నిందితుడు విదేశాలకు జంప్?



హైదరాబాద్ : సంచలనంగా మారిన కిడ్నీ రాకెట్ కేసులో ప్రధాననిందితుడు విదేశాలకు పారిపోయాడా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు పవన్ అలియాస్ లియోన్ ఉరఫ్ కిషోర్.. విదేశాలకు వెళ్లిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. మూడు వారాలుగా అతడి ఆచూకీ లభించకపోవటంతో అతను విదేశాలకు పరారై ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరూర్ నగర్ పోలీసులు తాజాగా లుకౌట్ సర్క్యులర్ ను జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పేదలకు డబ్బులు ఆశ చూపించి.. కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయించటంలో పవన్ కీలక సూత్రధారిగా పోలీసులు భావిస్తున్నారు. పేదల్ని కిడ్నీ ఇచ్చేలా ఒప్పించటం.. కిడ్నీ అవసరమైన వారిని గుర్తించటం.. ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన వైద్యుల్ని ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించటం.. సరూర్ నగర్ లోని అలకనంద ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించటం లాంటి అన్ని అంశాలకు ఇతడే కీలకసూత్రధారిగా భావిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ కేసుకు సంబంధించి రెండు కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందులో ఒకటి మధ్యవర్తిగా వ్యవహరించిన విశాఖకు చెందిన లక్ష్మణ్ ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఇతడే హైదరాబాద్ కు చెందిన డాక్టర్ అవినాశ్ ను సంప్రదించి.. కిడ్నీ ఆపరేషన్లు చేసేలా ఒప్పించాడు. అనంతరం 2023 ఏప్రిల్ నుంచి 2024 జూన్ వరకు సైదాబాద్ లోని జనని ఆసుపత్రిలో నలభై వరకు ఆపరేషన్లు నిర్వహించారు. ఇదే సమయంలో డాక్టర్ అవినాశ్ కు పవన్ పరిచయమయ్యాడు. జనని ఆసుపత్రిని మూసేసిన తర్వాత అలకనంద ఆసుపత్రి ఎండీ సుమంత్ ను ఆపరేషన్లు చేసేలా డీల్ కుదిర్చాడు. ఇక్కడే ఇరవైకు పైగా ఆపరేషన్లు.. అరుణ ఆసుపత్రిలో నాలుగు.. మరో ఆసుపత్రిలో పదికి పైగా ఆపరేషన్లు చేయటం ద్వారా ఒక్క హైదరాబాద్ సిటీలోనే తొంభై వరకు ఆపరేషన్లు చేయించినట్లుగా గుర్తించారు. మొత్తంగా కిడ్నీరాకెట్ కేసు విచారణలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. విదేశాలకు పారిపోయినట్లుగా భావిస్తున్న పవన్ (లియోన్) ఆచూకీ లభిస్తే ఈ కేసులో పెద్ద బ్రేక్ త్రూ అయినట్లు అవుతుందని చెబుతున్నారు.

# పరిశ్రమల్లో భద్రతపై దృష్టి

శ్రీకాకుళం : జిల్లా లోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు తీరును పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. పారిశ్రామిక యూనిట్లలో రసా యన ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాల ని, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ సమావేశ మంది రంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం గల వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్ర మల్లో కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు ఉండాలన్నా రు. తరచూ మాక్ డ్రిల్ నిర్వహిం చాలని సూచించారు. విష వాయువు లు వెలువడే పరిశ్రమల్లో ఎప్పటి కప్పుడు భద్రతా ప్రమాణాలపై తని ఖీలు నిర్వహించాలని.. ఇప్పటికే పూ ర్తిచేసిన తనిఖీల నివేదిక ఆధారంగా అన్ని పరిశ్రమలు మార్గదర్శకాలు పా టించేలా చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. జిల్లా సంక్షోభ నివారణ క మిటీ విపత్తు నిర్వహణ, సంక్షోభాల నివారణకు పూర్తి బాధ్యత వహిస్తుం దన్నారు. అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రుల్లో మందులు, సిబ్బంది, అంబులెన్స్, అవసరమైన ఇతర సదుపాయాలు ఏమేరకు ఉండాలనే అంశాలపై సమీక్షిం చారు. భద్రతా ప్రమాణాలపై సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు, జె.శివశంకరరెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర రావు, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, సివిల్ డిఫెన్స్ అధికారి కె.పద్మలత, డిప్యూటీ చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్స్ జె.సర్కార్, వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, పొల్యూషన్ అధికారి కరుణశ్రీ, విపత్తుల నిర్వహణ డీపీఎం పి.రాము, పరిశ్రమల కేంద్రం మేనేజర్ ఉమామహేశ్వరరావు, డీఎంహెచ్ఓ బాలము రళీకృష్ణ, వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు హాజరయ్యారు.

# రికార్డుల ట్యాంపరింగ్‌పై లోతైన విచారణ

### ముడసర్లోవలో గల ప్రభుత్వ భూముల రికార్డులు కూడా మార్చినట్టు ఇప్పటికే గుర్తింపు
### రూరల్ మండలంలోని మరికొన్ని గ్రామాల్లోనూ అక్రమాలు - అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారుల నిర్ణయం

విశాఖపట్నం : విశాఖ రూరల్ మండలం లో ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డుల ట్యాంపరింగ్ వ్యవహారంపై లోతైన విచారణ జరపాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ప్రభుత్వానికి మధురవాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 367, 368, 369లలో సుమారు 30 ఎకరాలు ఉన్నాయి. ఈ భూములకు సంబంధించిన రికార్డులు ట్యాంపర్ అయ్యాయి. ఈ వ్యవహారంలో అప్పట్లో (2004 నుంచి 2007 మధ్య) ఉన్న అధికారులు, సిబ్బందితో పాటు ఎవరెవరి పాత్ర ఉందో తేల్చనున్నారు. సుమారు రూ.1,000 కోట్ల విలువైన భూములు దోచుకునేందుకు రూరల్ మండలం, కలెక్టరేట్‌లో ఎఫ్-సెక్షన్ అధికారులు కలిసి పనిచేశారా?, వారి వెనుక ఉన్నతాధికారులు ఎవరైనా ఉన్నారా?...అన్న కోణంలో విచారణ చేయనున్నారు. మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెంతో పాటు మిగిలిన గ్రామాల్లో గల ప్రభుత్వ భూముల రికార్డుల మార్పుపైనా అధికారులు దృష్టిసారించారు. ముడసర్లోవలోని కొన్ని సర్వే నంబర్లు ట్యాంపర్ అయిన విషయాన్ని అధికారులు గతంలో గుర్తించి, విచారణ చేపట్టారు. ఇంకా, ఈ విధంగా మండలంలో ఏఏ గ్రామాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులు ట్యాంపర్ చేశారనేది క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. తూతూమంత్రంగా కాకుండా పక్కాగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు. మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెంలో ప్రభుత్వ భూముల రికార్డులను మార్చేసిన అంశంపై 2011లో తొలుత విచారణ ప్రారంభించారు. భూపరిపాలన ముఖ్య కమిషనర్ ఆదేశాలతో రెండు పర్యాయాలు విచారణ



జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దాని ఆధారంగా 2004 నుంచి 2007 వరకు రూరల్ మండలంలో పనిచేసిన తహసీల్దార్లు, సర్వేయర్లలో కొందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. రికార్డులు ట్యాంపర్ చేయడంలో బాధ్యులుగా గుర్తించిన ఏడుగురు అ?ధికారులు/ఉద్యోగులపై చర్యలు తీసుకోకుండా ఉన్నత స్థాయిలో కొందరు అడ్డుకున్నారు. డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతికి ఆటంకం కలగకుండా ఒకరిద్దరు ఎఫ్-సెక్షన్ సూపరింటెండెంట్లు ఉన్నతస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారు. నగరంలో అత్యంత విలువైన భూములు ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి ఉద్దేశపూర్వకంగా కోర్టుకు అఫిడవిట్ సమర్పించని అధికారికి ఉమ్మడి ఏపీలో, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో మంచి పలుకుబడి ఉంది. సదరు అధికారితోపాటు మిగిలిన వారంతా ఉన్నత స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి చర్యలు తీసుకోకుండా పైరవీలు చేశారు. ఇదిలావుండగా మధురవాడ సర్వే నంబర్లు 367, 368, 369, 370లో ప్రభుత్వ రికార్డులు ట్యాంపర్ వ్యవహారంపై విచారణ చేయాలని 2023 లో అప్పటి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఇచ్చిన ఆదేశాలకు లోబడి జేసీకి విచారణ బాధ్యతలు అప్పగిస్తూ గత ఏడాది సీసీఎల్ఏ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ఏడుగురు (అప్పటి 'ఎఫ్' సెక్షన్ సూపరింటెండెంట్లుగా పనిచేసి ప్రస్తుతం పలుచోట్ల డిప్యూటీ కలెక్టర్లుగా పనిచేస్తున్న పి.ధర్మ చంద్రారెడ్డి (ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ), ఎస్డీ అనిత (విశాఖ జిల్లా ఏపీఐఐసీ ఎస్డీసీ), డి.ప్రమీలాగాంధీ (బొబ్బిలిలో భూసేకరణ ఎస్డీసీ), కె.సుబ్బారావు (కాకినాడలో దేవదాయ శాఖ ప్రాంతీయ కమిషనర్), అప్పట్లో 'ఎఫ్' సెక్షన్‌లో టైపిస్టుగా చేసిన బి.రవికుమార్ (పాడేరులో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ తహసీల్దారు), ఆర్వీ మురళీధర్ (అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట తహసీల్దారు కార్యాలయంలో డీటీ), జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కె.విజయభాస్కర్ (విశాఖలోని పెదగంట్యాడ తహసీల్దారు కార్యాలయం డీటీ)) అధికారులు ఈ నెల 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ ఎదుట విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీచేయడం రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపింది.

# ఆస్తి పన్ను వసూలు అంతంతే!

సూర్యాపేట : పట్టణ వాసులు చెల్లించే పన్నులే మునిసిపాలిటీకి ప్రధాన వనరు. ఆస్తిపన్ను, భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులు, నల్లా చార్జీలు, ట్రేడ్ లైసెన్స, మునిసిపల్ ఆస్తుల అద్దెలు తదితర రూపాల్లో మునిసిపాలిటీకి ఆదాయం సమకూరుతుంది. వీటిలో ఆస్తి పన్నుదే ప్రధాన వాటా. నిర్మాణ అనుమతుల పేరుతో ఏడాది పొడవునా ఆదాయం లభిస్తుండగా, ఆస్తి పన్నును మాత్రం ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి వందశాతం వసూలు లక్ష్యంగా మునిసిపల్ యంత్రాంగాలు కృషి చేస్తుంటాయి. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం మరో 40 రోజుల్లో ముగియనుండగా, జిల్లాలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తిరుమలగిరి, నేరేడుచర్ల మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూలు అంతం త మాత్రంగానే ఉన్నాయి.. జిల్లాలో పన్ను డిమాండ్ రూ.28.77కోట్లు ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.15.54కోట్లు (54.01 శాతం) మాత్రమే వసూల య్యాయి. ఆస్తి పన్ను వసూళ్లకు పాత బకాయిలు ప్రధాన అవరోధంగా మారుతున్నట్లు మునిసిపల్ సిబ్బంది పేర్కొంటున్నారు. గత ఏడాది సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో నూరుశాతాన్ని దాటి రికార్డు స్థాయిలో పన్నులు వసూలు చేశారు. అయితే మిగతా మున్సిపాలిటీల్లో మాత్రం అంత ఆశాజనకంగా వసూళ్లు కాలేదు. ఈసారి అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులు ముందుకువెళుతున్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు గడువు సమీపిస్తున్న సమయంలో ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటిస్తుందని, ఆ సమయంలో పన్నులు చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు మాత్రం ముందు నుంచే పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. ఇప్పటికే వన్నులు చెల్లించని దుకాణాలను సీజ్ చేశారు. సూర్యాపేట మునిసిపాలిటీలో ఇప్పటి వరకు 54.30శాతం మేర పన్ను వసూలు పూర్తయింది. కోదాడలో 55.70, తిరుమలగిరిలో 51.20 శాతం పన్నులు వసూలయ్యాయి. జిల్లాలో నేరేడుచర్ల 75.73శాతం పన్ను వసూలులో ముందుండగా, హుజూర్‌నగర్‌లో కేవలం 39.03శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

**పన్నుల వసూళ్ల కోసం ప్రచారం**

సూర్యాపేట మునిసిపాలిటీ అధికారులు ఇంటి పన్నుల వసూళ్లను ముమ్మరం చేశారు. ఇంటి పన్నులతో పాటు వాణిజ్య సముదాయాలు, సెమీ వాణిజ్య సముదాయాలకు పన్నులు చెల్లించాలని విస్తృత ప్రచారం చేపట్టారు. ముఖ్యంగా ఆస్తి, నాలా పన్ను, ట్రేడ్ లైసెన్స, ఇతర పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. సూర్యాపేటలో ప్రత్యేకంగా వాహనాన్ని వినియోగిస్తూ అధికారులు ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని ఐదు మునిసిపాలిటీలకు కలిపి 30 బృందాలు ఈ




ప్రచారం నిర్వహిస్తున్నారు. అదేవిధంగా అన్ని మునిసిపాలిటీల్లో మునిసిపల్ అధికారులు వాహనాల్లో తిరుగుతూ పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పలు సర్వేలు, పథకాలకు అర్హులను గుర్తించేలా మునిసిపల్ సిబ్బందిని నియమించింది. జ్వర సర్వేతో పాటు ఇతర పనుల సర్వేలను చేపట్టడంతో వసూళ్లలో వేగం పుంజుకోలేదు. గతంలో ఆర్థిక సంవత్సరం చివరి నెలలో మాత్రమే వసూళ్లు చేస్తూ లక్ష్యం మాత్రం పూర్తి చేయలేకపోయేవారు. గతానికి భిన్నంగా ఈ ఏడాది డిసెంబరు, జనవరి నెల నుంచే వసూళ్లు ప్రారంభించారు. 30మందితో కూడిన బృందంలో బిల్ కలెక్టర్లు, ఒక ఆర్ఐ, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్‌లు, వీరితో పాటు మున్సిపల్ సిబ్బంది, జవాన్లు పన్ను వసూళ్లు చేస్తున్నారు. ఆదివారం, ఇతర పండుగల సెలవు దినాల్లో కూడా పన్నులు చెల్లించేలా ప్రజల సౌకర్థాం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లు కూడా ఏర్పాటు చేశారు.

# బెల్లం తయారీకి హైబ్రిడ్ యూనిట్

### సౌరశక్తితో చెరకు క్రషింగ్ - బయోమాస్ గ్యాసీఫెయిర్‌తో బెల్లం ఉత్పత్తి
### అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తల రూపకల్పన
### చెరకు క్రషింగ్, బెల్లం తయారీలో సమయం, డబ్బులు ఆదా
### నాణ్యమైన బెల్లం తయారీతో ఎగుమతులకు ఆస్కారం



అనకాపల్లి : అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం వ్యవసాయ ఇంజనీరింగ్ శాస్త్రవేత్తలు సోలార్ బయోమాస్ హైబ్రిడ్ బెల్లం తయారీ యూనిట్‌ను రూపొందించారు. ఆధునిక బెల్లం పరిశోధనా ప్రాజెక్టులో ఇదొక మైలురాయిగా చెప్పొచ్చు. ఈ హైబ్రిడ్ బెల్లం తయారీ యూనిట్‌లో సౌరశక్తిని ఉపయోగించి చెరకు క్రషింగ్, బయోగ్యాసీఫెయిర్‌తో చెరకు రసాన్ని మరిగించడం అనే రెండు పద్ధతులు ముఖ్యమైనవి. ఈ రెండింటిని రూపొందించడమే కాకుండా వీటిని ప్రామాణీకరించామని పోస్ట్ హార్వెస్టు టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సోలార్ బయోమాస్ హైబ్రిడ్ విధానంలో బెల్లం తయారీ వల్ల సమయం, డబ్బు, శ్రమ ఆదా అవడమేకాక నాణ్యమైన బెల్లం ఉత్పత్తి అవుతుందని చెప్పారు. చెరకు రసాన్ని మరిగించేటప్పుడు వెలువడే కర్బన్ ఉద్గారాలు బయోగ్యాసీఫెయిర్ వల్ల తగ్గిపోయి, పర్యావరణానికి మేలు చేస్తాయని వివరించారు.

**సోలార్ క్రషర్**

బెల్లం తయారు చేసే రైతులు ఇప్పటి వరకు విద్యుత్ మోటార్లతో చెరకు క్రషింగ్ చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం తొమ్మిది గంటలపాటు మాత్రమే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నది. అంతేకాక వివిధ కారణాల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతూ వుంటుంది. అప్పటి వరకు తీసిన చెరకు రసం ఒక బెల్లం పాకం తయారీకి చాలకపోతే మళ్లీ కరెంటు వచ్చే వరకు వేచివుండాల్సి వుంటుంది. దీంతో చెరకు రసం పులిసిపోతుంది. ఇటువంటి రసంతో తయారైన బెల్లం నాణ్యతలోపిస్తుంది. ఇందుకు ప్రతిగా విద్యుత్ క్రషర్‌కు 28 ప్యానళ్ల సౌరశక్తి కనెక్షన్ ఇచ్చినట్టయితే అంతరాయం లేకుండా చెరకును క్రషింగ్ చేయవచ్చు. సౌరశక్తిని వినియోగించు కోవడం వల్ల విద్యుత్ చార్జీలు 60 శాతం వరకు ఆదా అవుతాయి. 28 ప్యానళ్ల సౌరశక్తితో ఏడు హెచ్‌పీ వరకు మోటార్లు పనిచేస్తాయని జగన్నాథరావు చెప్పారు. సోలార్ విద్యుదుత్పత్తి యూనిట్లకు ప్రభుత్వం రాయితీ కూడా ఇస్తుందన్నారు.

బెల్లం తయారీ కోసం చెరకు రసాన్ని మరిగించేందుకు బయోమాస్ గ్యాసీఫెయిర్ పద్ధతి ద్వారా చెరకు పిప్పిని మండిస్తారు. బెల్లం పొయ్యిలో చెరకు పిప్పిని వేస్తూ గ్యాసీ ఫెయిర్ సాయంతో తీవ్ర ఉష్ణానికి, ఒత్తిడికి గురి చేసి గ్యాస్‌గా మారుస్తారు. ఈ గ్యాస్ సాయంతో వచ్చే మంట నుంచి నుసి, దుమ్ము వెలవడనందున కాలుష్య సమస్యే ఉండదు.

# ఊపందుకున్న పనులు

## అన్ని సౌకర్యాలతో హిందూ శ్మశాన వాటిక - రూ. 4 కోట్లతో నాలుగు ఎకరాల్లో నిర్మాణం
## ఒకేసారి ఎనిమిది దహన సంస్కారాలకు అవకాశం : శివరాత్రికి అందుబాటులోకి..

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మించతలపెట్టిన హిందూ శ్మశాన వాటిక పనులు వేగం పుంజుకున్నాయి. గోదావరి సమీపంలోని భూధాన్ యజ్ఞ బోర్డు భూముల్లో నాలుగెకరాల విస్తీర్ణంలో 14వ ఆర్థిక సంఘం నిధులు నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టగా, గత అక్టోబరు 3న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు శంకుస్థాపన చేశారు. శ్మశాన వాటికకు ప్రహరీ, ఇతర నిర్మాణ పనులు జరుగుతుండగా ప్రజల సౌకర్యార్థం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. శ్మశాన వాటిక నిర్మాణం పూర్తయితే ఇంతకాలం హిందూ ప్రజలు దహన సంస్కారాలకు పడుతున్న బాధలు తీరే అవకాశాలు ఉన్నాయి.

**వసతులు ఇలా....** హిందూ సాంప్రదాయం ప్రకారం దహన సంస్కారాలకు అవసరమైన అన్ని వసతులు కల్పించే విధంగా శ్మశాన వాటిక నిర్మాణాన్ని చేపట్టారు. ఒకేసారి ఎనిమిది మృతదేహాలను దహనం చేసే విధంగా ప్లాట్‌ఫాం నిర్మాణం చేపడుతున్నారు. దహన సంస్కారాల సందర్భంగా కుటుంబ సభ్యులు, ఇతర బంధువర్గం వీక్షించేందుకు ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేయనున్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా బాత్రూంలు, టాయ్‌లెట్ల నిర్మాణం చేపడుతున్నారు. శ్మశాన వాటిక మధ్యలో గ్రీనరీతో కూడిన పార్క్‌ను నిర్మిస్తున్నారు. దహన సంస్కారాల సమయంలో శివనామస్మరణ కోసం శ్మశాన వాటిక ఆవరణలో 20 ఫీట్ల ఎత్తైన శివ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్లాట్‌ఫాంను నిర్మిస్తున్నారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం గోదావరి రోడ్డు నుంచి 30 మీటర్ల మేర ఏర్పాట్లు చేస్తున్నారు. దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తుండగా, గోదావరి స్నానం చేయాలన్న కుతూహలం ఉన్నవారికి నది సమీపంలోనే ఉండటంతో ఆ అవకాశం కూడా ఉండనుంది.

**కిరాయిదారులకు ప్రత్యేక వసతి...**

వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చి, ఇక్కడ కిరారుకి ఉంటున్న స్థానికేతరుల కోసం శ్మశాన వాటికలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కిరాయికి ఉండేవారి కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే మృతదేహాన్ని యజమానులు ఇంట్లోకి అనుమతించడం లేదు. దహన కార్యక్రమాల అనంతరం 11 రోజుల పాటు జరిగే కర్మలు పూర్తయ్యే వరకు కూడా వారిని యజమానులు ఇళ్లలోకి రానివ్వడం లేదు. దీంతో అంత్యక్రియలు నిర్వహించిన నాటి నుంచి కార్యక్రమాలు ముగిసే వరకు గోదావరి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సౌకర్యాలు



లేనిచోట మహిళలు, పిల్లలతోపాటు ఉండాల్సి వస్తోంది. చలి, ఎండావానల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారు. కిరాయిదారుల అవస్థలను ధృష్టిలో పెట్టుకుని శ్మశాన వాటిక నిర్మాణంలో వారికి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. వారికోసం ప్రత్యేకంగా గదుల నిర్మాణం చేపడుతున్నారు. ఆ గదుల్లో కార్యక్రమాలు పూర్తయ్యే వరకు ఉండేలా అవసరమైన మౌలిక వసతులు కూడా కల్పిస్తున్నారు. హిందూ మతస్థులు దహన సంస్కారాలు, కర్మకాండల కోసం దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందులు నూతనంగా నిర్మించబోయే స్మశాన వాటికతో తొలగిపోనున్నాయి.

**శివరాత్రికి అందుబాటులోకి...**

మహా ప్రస్థానం పేరుతో నిర్మిస్తున్న శ్మశానవాటిక నిర్మాణ పనులు శివరాత్రికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మహాప్రస్థానం నిర్మాణ పనులు పూర్తిచేసి, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఇప్పటికే ప్రకటించారు. శ్మశాన వాటిక నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎమ్మెల్యే నిర్మాణ పనులు పూర్తిచేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌పై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దశాబ్దాల కాలంగా శ్మశానవాటిక లేక జిల్లా కేంద్రంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో శ్మశాన వాటిక కోసం చందాలు వసూలు చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో ఎట్టకేలకు శ్మశాన వాటిక నిర్మాణ కల నెరవేరుతుండగా, త్వరలో ప్రారంభానికి సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# అర్ధాంతరంగా నిలిచిన బయోమైనింగ్



- చెత్త తీయకుండానే చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- ఎండకాలంలో మంటలు... చలికాలంలో పొగ
- పొగ, గాలి కాలుష్యంతో ఇబ్బందులు

కరీంనగర్ : నగరంలోని పలు డివిజన్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించడమే కాకుండా వాహనదారులను, నగరవాసులను డంపింగ్ యార్డు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమస్య నుంచి విముక్తి కలిపించేందుకు కోట్ల రూపాయలతో చేపట్టిన బయోమైనింగ్ ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది.

**2023లో ప్రారంభం...** కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ నిధులతో డంపింగ్ యార్డులో బయోమైనింగ్ చేపట్టాలని 2023 జూన్‌లో నిర్ణయించారు. ఈ మేరకు డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా శుభ్రం చేసేందుకు ఓ కార్పొరేట్ కంపెనీకి ఏడాది గడువుతో కాంట్రాక్టు ఇచ్చారు. మొదట్లో బయోమైనింగ్ కొంత వేగంగా చేపట్టారు. అనంతరం అది నెమ్మదించింది. ఏడాదిలో చెత్త సమస్యను పూర్తిగా తొలగించాల్సిన కాంట్రాక్టర్‌కు మందకొడిగా బయోమైనింగ్ ప్రక్రియ చేపట్టడమే కాకుండా చెత్తను ఎక్కడికి తరలిస్తున్నాడో... ఎప్పటికి పూర్తి చేస్తారో చెప్పలతే. ఆరు నెలల క్రితం బయోమైనింగ్‌ను పూర్తిగా నిలిపివేశాడు. మైనింగ్‌లో వెలువడిన చెత్తను కూడా తరలించకుండా చేతులెత్తేశాడు. తనకు పార్ట్‌పేమెంట్‌గా డబ్బులు ఇస్తే తప్ప పనులు చేయనంటూ మొండికేశాడు. దీంతో డంపింగ్ యార్డు సమస్య మొదటికొచ్చింది. చెత్తను తొలగిస్తే తప్ప డబ్బులివ్వబోమని నగరపాలక సంస్థ అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చినా స్పందన లేక పోవడంతో బయోమైనింగ్ ఇక ముందుకు సాగే అవకాశం కనిపించడం లేదు. ఇప్పటి వరకు దాదాపు రెండు కోట్లు ఖర్చు చేశారు. అయినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

**నిధులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి హామీ...** ఇటీవల కరీంనగర్‌కు వచ్చిన కేంద్రపట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్‌కట్టర్ డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, అందుకు అవసరమయ్యే నిధులను కేటాయిస్తామని ప్రకటిం చారు. కేంద్రం చొరవ చూపి శాశ్వత చర్యలు చేపట్టే వరకు ఇక డంపింగ్ యార్డు సమస్య తీరేలా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ డంపింగ్‌యార్డుకు చెత్తను తగ్గించి రెడ్యూస్, రీయూజ్, రీసర్కిల్ (ఆర్‌ఆర్‌ఆర్) విధానాన్ని అమలు చేయాలని సూచిస్తున్నా ఇంకా చెత్తను యార్డుకు తరలిస్తూనే ఉన్నారు. చెత్తను తగ్గించి, ఉన్న చెత్తను తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు.

**నరకం చూపిస్తున్న డంపింగ్‌యార్డు...** నగరంలో నిత్యం టన్నుల కొద్ది వెలువడుతున్న చెత్తను ఎక్కడ వేయాలనే ప్రశ్న కొన్నేళ్లుగా వెంటాడుతోంది. ప్రత్యామ్నాయం లేక దశాబ్ద కాలం క్రితం నాటి డంపింగ్‌యార్డుకు తీసుకొచ్చి పడేస్తున్నారు. ఎండాకాలం వచ్చిందంటే చాలు చెత్తగుట్ట అంటుకొని మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. అధికారులు హడావుడిగా అక్కడికి వెళ్లి మంటలు ఆర్పుతారు. మంటలతోపాటు దట్టమైన పొగ వ్యాపిస్తుండటంతో ఆ ప్రాంత వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏడాదిలో వర్షాకాలం ఒకటిరెండు నెలలు మినహా మిగిలిన 10 నెలలు డంపింగ్ యార్డు నుంచి మంటలు, పొగ వ్యాపించడం కొనసాగుతూనే ఉంది. దీంతో బైపాస్ రోడ్డుపై వెళ్లే వాహనాదారులు, సమీపంలో ఉన్న కాలనీ వాసులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. పొగ, గాలి కాలుష్యంతోపాటు, దుర్వాసన భరించలేక అనారోగ్యాలకు గురవుతున్నారు. పొగ కారణంగా చెత్త తీసుకొచ్చే వాహనాలు డంపింగ్ యార్డు లోపలికి వెళ్లడం కష్టంగా మారుతోంది. గత వేసవి కాలంలో రెండు సార్లు డంపింగ్‌యార్డులో పెద్ద ఎత్తున మంటలు వ్యాప్తిచెందడంతో ఫైరింజన్లు, వాటర్ ట్యాంకర్లు, జెట్టింగ్ మిషన్ల ద్వారా మంటలను ఆర్పారు.

**రోజుకు 135 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ :**

నగరంలోని 86,400లకుపైగా ఉన్న కుటుంబాల నుంచి రోజుకు 135 నుంచి 155 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. దీంతో ప్రతిరోజు వస్తున్న చెత్తతో డంపింగ్‌యార్డులో దాదాపు 260 నుంచి 275 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయి గుట్టగా ఏర్పడింది. నగరంలో ఒకటే డంపింగ్ యార్డు ఉండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్ గ్రామశివారులో డంపింగ్‌యార్డు కోసం ఆనాటి కలెక్టర్ స్థలం కేటాయించారు. అక్కడ డంపింగ్‌యార్డు ఏర్పాటుకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఆ సమయంలో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం చెప్పారు. నగరంలో నుంచి చెత్తను తీసుకువచ్చి తమ గ్రామ సమీపంలో వేస్తే ఊరుకోబోమని పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. దీంతో అక్కడికి డంపింగ్ యార్డు తరలింపు చర్యలను విరమించుకున్నారు.

# మండలానికో నమూనా ఇందిరమ్మ ఇల్లు

పెద్దపల్లి : పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను నెరవేర్చేం దుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతీ మండలానికి ఒక ఇంటి నమూనా నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. వీటిని 42 రోజుల్లో పూర్తి చేయనున్నారు. జిల్లాలోని 14 మండలాల్లో నమూనా ఇళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్స రానికి ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించిన విషయం తెలిసిందే. ఆ మేరకు ప్రజాపాలన గ్రామ, పట్టణ సభల్లో దరఖాస్తులను స్వీకరించి అర్హులను గుర్తించారు. గత నెల 26న మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అక్కడ పూర్తి స్థాయిలో అర్హులందరికీ 1700 ఇళ్లు మంజూరు చేశారు. త్వరలోనే ఆ ఇళ్ల నిర్మాణాలను ఆరంభించనున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రతీకగా రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో



ప్రభుత్వం జిల్లాలో ప్రతి మండల కేంద్రంలో ఒక నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని చేపట్టింది. ప్రభుత్వం నిర్ధారించిన ఇందిరమ్మ ఇంటి నమూనా ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యే లబ్ధిదారులు తమ ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో గల ప్రభుత్వ ఖాళీ స్థలంలో నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గృహ నిర్మాణ శాఖ అధికారులు చేపట్టారు. ఈ నమూనా ఇళ్లకు ఒక్కో దానికి 5 లక్షల రూపాయలు కేటాయించారు. ఇందిరమ్మ ఇంటి నమూనాను చూసి ఆయా మండలాల్లోని వివిధ గ్రామాలకు మంజూరు కానున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నమూనా ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా ఆయా మండలాల మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో ప్రభుత్వ స్థలాల్లో ఈ నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు.

**42 రోజుల్లో పూర్తి చేసేందుకు అధికారుల చర్యలు**

నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు 42 రోజుల్లో పూర్తి చేసేందుకు సంబంధిత గృహ నిర్మాణ శాఖ అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వం అందజేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నమూనా ప్రకారం ఆయా మండలాల్లో గృహ నిర్మాణ శాఖ అధికారుల సమక్ష్యంలో ఆయా మండల స్థాయి అధికారులు నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి మార్కింగ్ చేసి పనులు ఆరంభించారు. జిల్లాలో నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిపి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నారు. సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్ మండ లాల్లో శరవేగంగా జరుగుతున్నాయి. స్లాబ్ లెవెల్ వరకు పూర్తయ్యాయి. ఈ నిర్మాణాలను మండల పరిషత్ అధికారులతోపాటు హౌసింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. హౌసింగ్ పీడీ రాజేశ్వర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇందిరమ్మ నమూనా ఇళ్ల నిర్మాణాలను 42 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఇప్పటి వరకు లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల పనులను ఆరంభిస్తామని అన్నారు.

# రామోజీ ఫిలిం సిటీలో ఇంటి స్థలాలను వెంటనే ఇవ్వాలి

## ఇంటి స్థలాలను కబ్జా చేసిన రామోజీ యాజమాన్యం పై కేసు నమోదు చేయాలి
## ఇంటి స్థలాలకు వెళ్ళకుండా అడ్డుకుంటున్న రామోజీ యాజమాన్యం
## సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

రంగారెడ్డి : ఇంటి స్థలాలను కబ్జా చేసిన రామోజీ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఇంటి స్థలాల పట్టాలు ఉన్న లబ్ధిదారులతో కలిసి ధర్నా చేయడం జరిగింది. అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ... పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను కబ్జా చేసిన రామోజీ యాజమాన్యం పై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 2007 సంవత్సరంలో ఇంటి స్థలం లేని పేదలందరికీ ఇంటి స్థలం ఇవ్వాలని పోరాటం చేసిన ఫలితంగా 2007 సంవత్సరంలో అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలం నాగన్ పల్లి గ్రామంలో సర్వేనెంబర్ 189లో 12ఎకరాలు, 203లో 8ఎకరాల 4గుంటల భూమిని నాగన్ పల్లి, పోల్కంపల్లి, రాయపోల్, ముకునూర్ గ్రామాలకు చెందిన 675 మంది పేదలకు 60 గజాల చొప్పున ఇంటి స్థలం పట్టాలు ఇచ్చారు. దీనికి లేఅవుట్ నక్ష ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి లబ్ధిదారులను నమ్మించి కొంతమంది లబ్ధిదారుల నుంచి అప్పుడున్న అధికారులు ఇంటి పట్టాలను కూడా తీసుకున్నారు. గత 17 సంవత్సరాలుగా సిపిఎం ఆధ్వర్యంలో ఈ ఇంటి స్థలాలు ఇవ్వాలని నిరంతరం పోరాటం చేస్తున్నామని అందులో భాగంగానే 2022 నవంబర్ లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున లబ్ధిదారులతో కలిసి ధర్నా చేసిన సందర్భంగా రామోజీ యాజమాన్యం సర్వే నెంబర్ 189, 203లో ఇంటి స్థలాల కోసం కేటాయించిన భూమిని తమకు కేటాయిస్తే వేరే సర్వే నెంబర్లలో ఇంటి స్థలాల కోసం 25 ఎకరాల అసైన్డ్ భూమిని రైతుల నుంచి కొనుగోలు చేయడానికి అవసరమైన నష్టపరిహారాన్ని చెల్లిస్తామని రామోజీ వారు అప్పుడున్న కలెక్టర్ గారికి దరఖాస్తు చేసుకున్నారు. రామోజీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారుల వెంటనే లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కానీ నేటి వరకు అటువంటి ప్రయత్నాలు ఏ జరగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే లబ్ధిదారులకు కేటాయించిన సర్వే నెంబర్లలోనే ఇంటి స్థలాల ఇవ్వాలని అన్నారు. నిరుపేదలైన లబ్ధిదారులకు ఇంటి స్థలాల ఇచ్చి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వమే ఐదు లక్షల రూపాయల నిధులను ఇవ్వాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తక్షణమే మంగళవారం రామోజీ యాజమాన్యాన్ని పిలిపించి ఆర్డీవో సమక్షంలో లబ్ధిదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుల బి సామెల్, మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు పాల్గొన్నారు

# హైదరాబాద్‌లో దమ్ మేరా దమ్

హైదరాబాద్ : హైదరాబాద్‌లో పబ్‌లు ఎంత గబ్బో మరోసారి బయటపడింది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లోని ఆలివ్ బిస్ట్రో పబ్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. మాదక ద్రవ్యాలతో దమ్ మారో దమ్ జరుగుతోందంటూ పకడ్బందీ సమాచారం రావడంతో ఆలివ్ బిస్ట్రో పబ్‌పై పోలీసులు రెయిడ్ చేశారు. 20 మందికి డ్రగ్ పరీక్షలు చేయగా.. ఒకరికి పాజిటివ్‌గా తేలిందిహైదరాబాద్ లోని కొన్ని పబ్‌లు అరచకానికి అడ్డాగా మారుతున్నాయి. బయటకేమో ఆయుర్వేదిక్ బార్ అంటారు. లోపల మాత్రం అడ్డగోలు పనులు నడుస్తాయి. ఆయుర్వేదం లేదు ఆరోగ్యం లేదు. డ్రగ్స్ ను అడ్డు అదుపు లేకుండా సరఫరా చేస్తూ ఇల్లీగల్ దందా నడుపుతున్నారు. హైదరాబాద్‌లోని అనేక పబుల్లో, రిసార్టుల్లో గుట్టుగా రేవ్ పార్టీలు సాగుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు చాలా పబ్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. డ్రగ్స్ వినియోగం, అశ్లీల నృత్యాలతో రేవ్ పార్టీలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని తొమ్మిది పైగా పబ్బుల్లో మాదక ద్రవ్యాల విక్రయాలు జోరుగా సాగుతున్నట్టుగా గతంలో పోలీసులే అధికారికంగా ప్రకటించారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రాష్ట్ర పోలీసులు కొంత కాలంగా డ్రగ్స్ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. పబ్బులు అభివృద్ధికి చిహ్నామా? లేదంటే వెనకబడుతుందా? ఆధునిక సంస్కృతిని అభివృద్ధిని అందిపుచ్చుకోవడం ఎంత అవసరమో.. అదే సమయంలో పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి అడ్డుకోవడం కూడా అంతే అవసరం. డ్రగ్స్ అమ్మడం, సరఫరా చేయడం యువతను డ్రగ్స్ బానిసలుగా మార్చడం అంతకంటే వే కారణాలు అవసరమా.పబ్బులు ఉంటేనే అభివృద్ధి అని భావిస్తే.. అంతకంటే అజ్ఞానం మరొకటి లేదు. గంజాయి నుంచి కొకైన్ దాకా రోడ్లపైనే అమ్మకాలు, నిత్య గోవాక ప్రయాణాలు, యూట్యూబ్‌లో చూసి డ్రగ్స్ తయారు చేసి విక్రయాలు, వాటిని మితిమీరి వాడి యువకులు మృతి చెందడం. ఇప్పుడు హైదరాబాద్ నడిబొడ్డున పబ్బులో డ్రగ్స్ గబ్బు బయటపడింది.

అర్ధరాత్రి దాటిన యువతీ యువకులు మత్తులో చిందులేస్తున్న రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నారు. తాజాగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లోని ఆలివ్ బిస్ట్రో పబ్‌లో డ్రగ్స్ పార్టీ కలకలం రేపింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు రెయిడ్ చేశారు. అందులో కొంత మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్ అయినట్లు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

# బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీలో మాట్లాడతా

## - ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిలప్రియ

చాగలమర్రి : అంగన్వాడి టీచర్లు, ఆయాల సమస్యలపై బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీలో తప్పకుండా మాట్లాడుతానని ఆళ్లగడ్డ శాసనసభ్యులు భూమా అఖిల ప్రియ అన్నారు. సోమవారం శాసన సభ్యుల నివాస గృహంలోని చాంబర్లో అంగన్వాడి నాయకురాలు అంగన్వాడి టీచర్లు వినతి పత్రం సమర్పించారు. ఏఐటీయూసీ అనుబంధ సంస్థ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు వసుంధర దేవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకళ వినతి పత్రాన్ని సమర్పిస్తూ తమ తమ సమస్యలను శాసన సభ్యులకు విపులంగా వివరించారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబర్ నుంచి 2024 జనవరి వరకు అంగన్వాడి టీచర్లు, ఆయాలు పలు డిమాండులు నెరవేర్చాలని నిరగదిక సమ్మె చేయడం జరిగిందన్నారు. రూ 26, వేలు వేతనం మంజూరు చేస్తూ పని భారం తగ్గించాలని , రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పలు సమస్యలు పరిష్కరించాలన్నారు. 42 రోజులు సమ్మె చేస్తున్న అంగన్వాడి కార్యకర్తలు సమ్మెను ఆపాలని అనేక నిర్బంధాలతో పాటు ఎస్మా చట్టాన్ని జగన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. చివరకు చర్చలు జరిపి ఒక ఒప్పందానికి రావడం జరిగింద అఖిలప్రియ కు వివరించారు. సమ్మెలో తెలుగుదేశం పా మద్దతు ఇచ్చి అన్ని విధాల సహకరించడం జరిగిందన్నారు జగన్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న చంద్రబాబు లోకేష్ లు పవన్ కళ్యాణ్ తో పాటు అంగన్వా కార్యకర్తలకు సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేతనాల పెంచి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు ప్రభుత్వం వచ్చి 8 మాసాలు గడుస్తున్నా సమస్యలపై స్పంద లేదని అంగన్వాడి కార్యకర్తలు శాసనసభ్యులు ఎదుట ఆవేద వ్యక్తం చేశారు. కావున ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీలో తమ సమస్యలను చర్చించి పరిష్కరించాల కోరారు.

తప్పకుండా అసెంబ్లీలో అంగన్వాడి సమస్యలపై చర్చించడాని సహకరిస్తామని శాసనసభ్యులు భూమా అఖిలప్రియ హామీ ఇవ్వడం జరిగింది. వినతిపత్రం సమర్పించే కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ కాకి సుజాత, ఇందుమతి రాజేశ్వరి తిరుపతమ్మ, నాగేంద్రమ్మ, సువర్ణమ్మ, సుశీల, సుమల సునీత తదితరులు ఉన్నారు.

# అంగన్వాడీలకు సమ్మె కాలపు ఒప్పంద హామీలు అమలు చేయాలి

ఆళ్లగడ్డ : అంగన్వాడీలకు సమ్మె కాలపు ఒప్పంద హామీలు అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. జిల్లా నాయకురాలు నిర్మలమ్మ, ఆళ్లగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ఆళ్లగడ్డ సిఐటీయు కార్యదర్శి తాళ్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. సిడిపిఓ ఆఫీస్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేసారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడిలకు నెలకి కనీస వేతనం రూ. 26,000 ఇవ్వడంతోపాటు గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడెన్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. గ్యాస్ గవర్నమెంట్ ఫ్రీగా ఇవ్వాలని, టీఏ,డీఏలు ఇవ్వాలని పెండింగ్ లో ఉన్న ప్రస్తుత బిల్లులన్నీ ఇవ్వాలన్నారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి మట్టి ఖర్చులకు రూ .20 వేలు డబ్బు ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిడిపిఓ ఆఫీస్ వెనక భాగంలో మీటింగ్ సమయాల్లో టీచర్లను కింద కూర్చోబెట్టకునీడా, కుర్చీలు వేసి కూర్చున్న బెట్టి వారికి గౌరవం ఇవ్వాలన్నారు. అంతేకాకుండా స్టాండర్డ్ గా అరుగులు బండల వేయించి రేకుల షెడ్డు వేయించి ఫ్యాన్లు సౌకర్యం కల్పిస్తు మీటింగులు నియమిస్తే బాగుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే కాలంలో అంగన్వాడీలకు ఇచ్చిన వాగ్దానాల నిలబెట్టుకోకుంటే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి నాయకురాలు శైలజ, పెద్దక్క, నరసమ్మ, సుధామణి, భారతి తో పాటు పెద్ద ఎత్తున అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు



## కేటీఆర్ సేన క్యాలెండర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, వరంగల్:**

కేటీఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్ ఆధ్వర్యంలో కేటీఆర్ సేన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై.. క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ, తమ లక్ష్యం మరోసారి కెసిఆర్ ను ముఖ్యమంత్రిగా చూడడం అని పేర్కొన్నారు. అందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కే టీ ఆర్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి మింటిరెడ్డి అశోక్ ,తూర్పు ఇన్ చార్జి ఉదయ్, సోషల్ మీడియా నాయకులు బాబుమియా, కిషోర్, నరేష్ , సురేష్ ,రాజేష్ ,పవన్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆరె తెలంగాణ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, వరంగల్:**

'ఆరె తెలంగాణ' జర్నలిస్టుల వెల్ఫేర్ సొసైటీ–2025 క్యాలెండర్‌ను ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న, ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ మంగళవారం ఆవిష్కరించారు. ఆరె కులస్తుల సంఘటితం కోసం క్యాలెండర్ రూపొందించిన ఆరె తెలంగాణ జర్నలిస్టుల వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు కోలె దామోదర్ రావును వారు అభినందించారు. క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా దామోదరరావుకు స్వీట్ తినిపించి నాగుర్ల వెంకన్న శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరె సామాజిక వర్గ ప్రజల చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సుమారు 8 ఏండ్లుగా ఆరె సామాజిక వర్గ ప్రజలను చైతన్యపరచడం కోసం తన వంతుగా క్యాలెండర్ ప్రతి ఏటా రూపొందించి.. గ్రామగ్రామాన అందజేస్తున్న దామోదర్‌రావును వెంకన్న ప్రత్యేకంగా అభినందించారు. వచ్చే నెలలో సొసైటీ వార్షికోత్సవం ఉందని ఈ సందర్భంగా దామోదరరావు పేర్కొన్నారు. ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు జెండా రాజేశ్, సోమిడి అంజన్ రావు నాయకులు పాల్గొన్నారు.



## దేవునూర్‌లో ఘనంగా శివాజీ జయంతి

**వేద న్యూస్, వరంగల్:**

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామంలో మరాఠ సామ్రాజ్య స్థాపకుడు, హైందవ ధర్మ రక్షకుడు భారతీయ వీరత్వం రాజకీయ ప్రతిభకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహరాజ్ 395వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిం చారు. గ్రామ ఆరె కుల సంఘం అధ్యక్షుడు లింగంపల్లి చిరంజీవి అధ్యక్షతన గ్రామంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూల దండలు వేసి కొబ్బరికాయలు కొట్టి తదానంతరం స్వీట్లు పంపిణి చేశారు. శివాజీ మహరాజ్ అభిమానులు, జిల్లా, మండల ఆరె కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



## దేశాన్ని రక్షించడంలో శివాజీ పాత్ర ఎనలేనిది

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మరాఠా సామ్రాజ్య వీరుడు బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహరాజ్ 395 జయంతి సందర్బంగా బీసీ సంక్షేమ సంఘం ఓయూ లోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ మొఘలుల బారి నుంచి మరాఠా సామ్రాజ్యాన్ని కాపాడటంలో శివాజీ మహరాజ్ విజయాన్ని సాధించారన్నారు. ఔరంగజేబ్ ను ముప్పు తిప్పలు పెట్టి..తన చివరి శ్వాసవరకూ మొఘల్ సైన్యాలను తరిమికొట్టారన్నారు. ఆయన ధైర్యసాహసాలకు చిరునామాగా నిలిచారు. ఒక చిన్న లక్ష్యం దిశగా వేసే ప్రతి అడుగు.. ఆ తరువాత పెద్ద లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని దీని అర్థం పెద్ద లక్ష్యాలను సాధించే ముందు చిన్న లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ ,ఓయు జెఎసి చైర్మన్ బండి నరేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోదా రవీందర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్ లు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**




కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను సవరించాలని పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తయారు చేసిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేయాలని 10 కమ్యూనిస్టు విప్లవ పార్టీలు ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో వివిధ వామపక్ష విప్లవ పార్టీల నాయకులు కార్యకర్తలు ధర్నా చేశారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమనికి న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరా జు అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సిపిఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, సిపిఐ ఎంఎల్ నీ డెమోక్రసీ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెన పల్లి యాదగిరి, ఎంసిపిఐయు నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఎస్‌యుసిఐ నాయకులు, సత్యనారాయణ లు మాట్లాడారు. ఎల్‌ఐసి 100శాతం ప్రైవేట్ పరం చేయడం ఆపేయాలని ప్రవర్తన సంస్థలను ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ప్రైవేటు పరం చేయడం ఆపివేయాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కు 50 శాతం నిధులు పెంచాలని జిడిపిలో విద్య వైద్య రంగాలకు మూడు శాతం నిధులు అదనంగా ఇవ్వాలని ప్రజా పంపిణీ వ్యవస్థకు సబ్సిడీలు పెంచాలన్నారు. ఎస్సీ ఎస్టీ రంగాలకు మహిళా శిశు సంక్షేమ శాఖలకు అధిక నిధులు కేటాయించాలని, పెట్రోలియం ఉత్పత్తులపై పెంచిన పనులను తగ్గించాలని తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి బషీర్ ఆడెపు సదయ్య పనస ప్రసాద్, ఐతం నగేష్ టి భవాని, దుర్గయ్య, ఇనుముల శ్రీనివాస్, రంజిత్, గన్నారపు రమేష్, గంద్రతి హరిబాబు, ప్రశాంత్, మాలి ప్రభాకర్, దేశెట్టి సమ్మయ్య, మధు, సురేష్, వాణి, ఉదయశ్రీ లతో పాటు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తిప్రదాత శివాజీ

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



మరాఠా యోధుడు, అసమాన ధీశాలి, ఆదర్శ మరాఠా స్వరాజ్య స్థాపకుడు బడుగుల జీవితాలలో దారిదివిటి ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని బుధవారం ఎల్కతుర్తి మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శివాజీ 395వ జయంతిని మండల పరిధిలోని, దామెర, చింతలపల్లి, సూరారం, ఎలుకతుర్తి ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. దామెర గ్రామస్తులు బైకు ర్యాలీ నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సుకినే సంతాజీ హాజరై మాట్లాడారు. ఆరెకుల ఆరాధ్య దైవ సమానులు మహారాష్ట్ర కుంబి కులంలో జన్మించి స్వశక్తితో మారాట సామ్రాజ్యం స్థాపించి, దేశంలోని బహుజనులకు చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన వ్యక్తి ఛత్రపతి శివాజీ మహరాజ్ అని కొనియాడారు. మండల కేంద్రంలోని ఆరెకుల సంఘం మండల అధ్యక్షుడు కుడితాడి రాజు ఆధ్వర్యంలో జరిగిన శివాజీ జయంతి వేడుకలను పార్టీలకతీతంగా నిర్వహించారు. అనంతరం ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని రైతులు, స్త్రీలు ఉన్నత వర్గాలు నిమ్న వర్గాలకు భాగస్వామ్యం చేసి, ఆదర్శ బహుజన రాజ్యం స్థాపించిన యోధుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని పేర్కొన్నారు. చిన్నతనంలోనే యుద్ధం చేసి కోటలను గెలుస్తూ మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి,వారికి చరమ గీతం పాడి భారతదేశంలో మరాఠా సామ్రాజ్యం స్థాపించి, స్త్రీని గౌరవించి హిందూ ధర్మానికి వన్నెతెచ్చిన వీరుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని తెలిపారు. కార్యక్రమంలో ఆరె సంఘం మండల అధ్యక్షుడు కుడితాడు రాజు, జిల్లా నాయకులు హింగే భాస్కర్, సుకినె సుధాకర్ రావు, అంబీర్ శ్రీనివాస్, హింగే రవీందర్, వరికల కృష్ణ, కదం రాజు, రాజేశ్వరరావు, కృష్ణ, గోలి రాజేశ్వర్ రావు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్ బక్కి, రవీందర్ రెడ్డి, రాజేందర్, బిక్షపతి, రమేష్,హింగే శ్రీకాంత్, రమేష్ బాబు, సురేందర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# అప్పులు చెల్లించేందుకు చోరీలు..!

**వేద న్యూస్, హన్మకొండ :**

రద్దీగా వున్న సమయాల్లో ఒంటరి మహిళలే లక్ష్యంగా చేసుకోని మహిళల మెడల్లో బంగారు అభరణాలు చోరీలకు పాల్పడుతున్న భార్యభర్తలను హనుమకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేసారు. ఈ దంపతులను నుండి సుమారు ఏడు లక్షల యాబ్కె వేల రూపాయల విలువగల 80.5 గ్రాముల బంగారు అభరణాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబందించి హనుమకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండల కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన భార్య భర్తలు బొంత జ్యోతి, బొంత కిషన్,ఇరువురు రోజు వారి కూలీలుగా పనిచేసేవారు. దీని వలన వారికి వచ్చే అదాయం వారి ఇంటి ఖర్చులకు సరిపోకపోవడంతో పాటు, కొద్ది కాలంగా ఇరువురికి ఆరోగ్య సమస్యలు రావడంతో ఖర్చుల నిమిత్తం పరియచస్తుల వద్ద డబ్బును అప్పుగా తీసుకోవడం జరిగింది. తీసుకున్న అప్పును చెల్లించేందుకు వారికి వచ్చే అదాయం సరిపోకపవడంతో అప్పు ఇచ్చిన వారి నుండి ఒత్తిళ్ళు రావడం ఈ ఘరానా దంపతులు సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం ఈ కిలాడీ జంట రద్దీగా వుంటే ప్లాట్‌ఫారంపై వున్న బస్సు ఎక్కె ఒంటరి మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చేసుకోని చోరీ చేసేందుకు ఈ దంపతులు సిద్దపడ్డారు. చోరీలో భాగంగా పథకం ప్రకారం భర్త ముందుగా రద్దీగా ప్రయాణీకులు ఎక్కే ద్వారంలో ఎవరు ఎక్కకుండా బస్సు లొపలికి వెళ్ళేందుకు ఇబ్బంది పడుతున్నట్లుగా ద్వారంలో నిలబడి ఉండే సమయంలో నిందితురాలు అయిన మహిళ మహిళల మెడల్లోని బంగారు అభరణాలు చోరీ చేసి అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయేవారు. ఇదే రీతిలో ఈ దంపతులు ప్రస్తుత ఫిబ్రవరి మాసంలో హనుమకొండ బస్టాండ్‌లో మూడు చోరీలకు పాల్పడి బంగారు అభరణాలు చోరీకి పాల్పడ్డారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను వారి ఇంటిలో భద్రపరిచేవారు. ఈ చోరీలపై ఫిర్యాదులు నమోదు చేసుకున్న హన్మకొండ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు టీంను ఏర్పాటు చేయడం జరిగింది. పోలీసులకు అందుబాటులో ఉన్నా టెక్నాలజీని వినియోగించుకోని నిందితులను గుర్తించడం జరిగింది. బుధవారం ఉదయం ఈ కిలాడీ దంపతులు చోరీ సోత్తును హనుకొండలోని ఎద్కెనా బంగారు దుకాణంలో అమ్మేందుకు చౌరస్తాకు రావడంతో అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఈ దంపతులపై అనుమానంతో వారి వద్ద వున్న బ్యాగ్‌ను తనీఖీ చేయగా అందులో బంగారు అభరణాలు గుర్తించిన పోలీసులు వారి అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. ప్రతిభ కబరిచిన హనుమకొండ ఇన్స్‌స్పెక్టర్ సతీష్, ఆడ్మిన్ ఎస్.ఐ అశోక్, డిటెక్టివ్ ఎస్.ఐ కిషోర్, హెడ్‌కానిస్టేబుళ్ళు రవూఫ్, నారాయణ, కానిస్టేబుళ్ళు మహేష్,వీరన్న, ఆశోక్, భాస్కర్, మహిపాల్‌ను ఏసిపి అభినందించారు.

## టిఎస్ జేయూ కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, భూపాలపల్లి జిల్లా:**



గణపురం మండలం మాధవరావు పల్లి గ్రామంలో బుధవారం భూలక్ష్మి మహాలక్ష్మి బొడ్రాయి వేడుకల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అ నంతరం జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు నూతన కమిటీ సభ్యులకు శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్ట్ ల సంక్షేమం కోసం నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్,జయశంకర్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, సంయుక్త కార్యదర్శి కడపాక రవి,కోశాధికారి శేఖర్ నాని,ఈసి మెంబెర్ కె.దేవేందర్ తదితరులు ఉన్నారు ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అప్పం కిషన్,కొత్త వెంకన్న,సుంకరి సుధాకర్ రెడ్డి,ఓద్దుల విజయ అశోక్ రెడ్డి,మామిడాల విజయ్, తేలు కుమారస్వామి వున్నారు.

## విద్యాలయాలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్

**వేద న్యూస్, శాయంపేట:**



హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మహాత్మ జ్యోతిబాపూలే విద్యాలయాలను అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి బుధవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు అనంతరం విద్యార్థులతో మాట్లాడి సిలబస్ ఎక్కడ వరకు పూర్తయింది పరీక్షలకు ఎలా సన్నతమవుతున్నారు ఏమైనా సమస్యలు ఉన్నాయా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి అని అన్నారు. విద్యార్థిని, విద్యార్థుల కు భోజనం ఎలా వండుతున్నారు మెను ప్రకారం భోజనం పెడుతున్నారా కూరగాయలు రోజువారి వినియోగిస్తారు అని అడిగి తెలుసుకున్నారు.ఏమైనా పరిస్థితి మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మహాత్మ జ్యోతిబాపూలే బాలుర విద్యాలయంలో నీటి సమస్య ఉందని అంటే వెంటనే మిషన్ భగీరథ డిఈ, ఏఈలతో మాట్లాడి వాటర్ సమస్యను చెప్పడం జరిగింది. మీరు వెంట ఆర్డిఓ నారాయణ, తహసిల్దార్ కలువాల సత్యనారాయణ పాల్గొన్నారు.



## ప్రజల కష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసు

మొదటి పేజీ తరువాయి

అందరూ కష్టపడాలని పిలుపునిచ్చారు. ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ బీఆర్ఎస్ కాదని, కేసీఆర్ ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దిన పార్టీ బీఆర్ఎస్ అని అని వెల్లడించారు. ప్రజల్లో ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతోందని, ఇక లేవదని ఎద్దేవా చేశారు. అనంతరం ఆవిర్భావ వేడుకలు, సభ్యత్వ నమోదు, భారీ బహిరంగ సభ, సంస్థాగత కమిటీలు, ప్లీనరీ వివిధ అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై చేపట్టాల్సిన కార్యాచరణపై ఆ పార్టీ శ్రేణులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

## విద్యలో ట్రాన్స్ జెండర్‌లకు సమాన అవకాశాలు

**వేద న్యూస్, హన్మకొండ :**




ట్రాన్స్ జెండర్ లపై అపోహలు తొలిగిపోవాలని, వారిని చూసే తీరు మారాలని ట్రాన్స్ జెండర్ హక్కుల కార్యకర్త ఓరుగంటి లైలా అన్నారు. తనను తాను ట్రాన్స్ మహిళగా పరిచయం చేసుకున్నానంటే, బయట హిజ్రాలను బెగ్గర్ గా సమాజం చూస్తుంది. సమాజంలో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అన్నిట్లోనూ సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలని కోరారు. సాథీ, స్టార్ సంస్థల సంయుక్త ఆద్వర్యంలో సోషియాలజీ, సోషల్ వర్క్ డిపార్ట్ మెంట్స్ కలిసి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషియాలజీ డిపార్ట్ మెంట్ హెచ్. ఓ. డి స్వర్ణలత మాట్లాడుతూ ఎడ్యుకేషన్ లో ట్రాన్స్ జెండర్ లకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ సంస్థ జనరల్ సెక్రటరీ కిరణ్ నాయక్, ప్రతినిధులు అమిత్, నేహా, ప్రో. ఐలయ్య, ప్రొ. రాజ్ కుమార్, డా. వెంకన్న, ప్రొ. కె. శ్రీనివాస్, ప్రో. ప్రసన్న, ప్రొ. వాసు, సోషియాలజీ విద్యార్థులు సాంబ రాజు, గణపతి, ఉదయ్, శర్మ, అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073